క్లుప్తంగా

వేంకటేశ్వరస్వామికి స్నపన తిరుమంజన సేవ



వేంకటేశ్వరస్వామికి గంధాభిషేకం

వేపాడ: మండల కేంద్రంలోని శ్రీదేవి,భూదేవి సమేత కల్యాణ వేంకటేశ్వరస్వామికి స్నపన తిరుమంజన సేవ శుక్రవారం వైభవంగా నిర్వహించారు. ఆలయ ధర్మకర్త రాపర్తి చిరంజీవి ప్రసాద్ మంత్రోచ్చారణల నడుమ స్వామివారికి పంచామృతాభిషేకం, సుగంధ ద్రవ్యాభిషేకం, హరిద్రోదకాభిషేకం, నక్షత్ర హారతి, కర్పూర హారతి, దీప హారతి తోపాటు పట్టు వస్త్రాలంకరణ, అష్టోత్తర శతనామాలతో పూజలు చేపట్టారు. భక్తులు అధిక సంఖ్యలో స్వామివారిని దర్శించుకుని తీర్థ, ప్రసాదాలు స్వీకరించారు.

చిన్నారులకు పౌష్టికాహారం

● సీడీపీఓ నాగమణి

దత్తిరాజేరు: బాల్య దశలోనే పిల్లలకు మంచి పౌష్టికాహారం అందించాలని గజపతినగరం సెక్టార్ సీడీపీఓ నాగమణి అన్నారు. దత్తిరాజేరు, కె. కొత్తవలస ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలలో వేర్వేరుగా అంగన్‌వాడీ, ఆశ కార్యకర్తలతో శుక్రవారం సమావేశాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, పిల్లల్లో మొదటి ఆరు సంవత్సరాల వరకు శరీర అలసట ఎక్కువగా ఉండడం వల్ల పాలు, గుడ్లు, పప్పు, కూరగాయలు, ఆకు కూరలు ఎక్కువగా అందివ్వాలని సూచించారు. చిన్నప్పటి నుంచే పౌష్టికాహారం ఇవ్వడం వల్ల ఆరోగ్యకరమైన ఎదుగుదల ఉంటుందని తెలిపారు. కార్యక్రమంలో దత్తిరాజేరు వైద్యాధికారి సతీష్ కుమార్, కె. కొత్తవలస హెల్త్ ఎడ్యుకేటర్ గిరి బాబు, సూపర్‌వైజర్లు ధనలక్ష్మి, ఇందిరాభవానీ, అపర్ణ, తదితరులు పాల్గొన్నారు.

విద్యాలక్ష్మికి పంచామృతాభిషేకాలు



అమ్మవారికి అభిషేకం నిర్వహిస్తున్న అర్చకుడు

విజయనగరం రూరల్: మండలంలోని దుప్పాడ గంగానగర్ శ్రీ క్షేత్రమ్‌లో కొలువైన అష్టలక్ష్మి సమేత ఐశ్వర్య వేంకటేశ్వరుని దేవాలయంలో విద్యాలక్ష్మి అమ్మవారికి శుక్రవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ అర్చకులు చామర్తి రమేష్ ఆచార్యులు, శ్రీనివాస్ రమేష్ ఆచార్యుల ఆధ్వర్యంలో అమ్మవారికి స్నపనం, పంచామృత అభిషేకాలు, అర్చనలు చేపట్టారు. కార్యక్రమంలో ఆలయ ధర్మకర్తలు దుర్గాబాలాజీ, ఉమాదేవి దంపతులు, భక్తులు, తదితరులు పాల్గొన్నారు.

ఆర్థిక సాయం



ఆర్థికసాయం అందిస్తున్న సంఘ ప్రతినిధులు

విజయనగరం టౌన్: అనారోగ్యంతో బాధపడుతూ ఇటీవల మృతిచెందిన గ్యాస్ గొడౌన్ వాచ్‌మన్ పి.వెంకటరమణ కుటుంబానికి జిల్లా బ్రాహ్మణ సంక్షేమ సమైక్య సేవాసంఘం ఆర్థిక సాయమందించింది. బాధిత కుటుంబాన్ని సంఘ సభ్యులు శుక్రవారం పరామర్శించారు. ఈ సందర్భంగా సంఘ ప్రతినిధులు టీవీ శ్రీనివాస్, రామ్‌కుమార్, కూరెళ్ల సరోజిని, కేవీ శాస్త్రి, తదితరులు మృతుని కుటుంబ సభ్యులకు రూ. 50 వేల ఆర్థిక సాయం అందజేశారు. కార్యక్రమంలో సంఘ ప్రతినిధులు రమేష్, మల్లీశ్వరి, గన్నవరపు శ్రీనివాస్, సరిపల్లి శ్రీనివాస్ పాల్గొన్నారు.

ఎమ్మెల్యేను కలిసిన డీఎస్సీ అభ్యర్థులు



డీఎస్సీ అభ్యర్థులకు మెటీరియల్ అందజేస్తున్న ఎమ్మెల్యే అదితి గజపతిరాజు

విజయనగరం రూరల్: ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు డీఎస్సీపై తొలి సంతకం చేయడంతో డీఎస్సీ అభ్యర్థులు స్థానిక ఎమ్మెల్యే పి.అదితి గజపతిరాజును ఆమె స్వగృహంలో శుక్రవారం కలిసి హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా కొంతమంది అభ్యర్థులకు టీఎన్ఎస్ఎఫ్ ఆధ్వర్యంలో ఆమె మెటీరియల్ అందజేశారు.

రక్తదాతలే ప్రాణదాతలు

● ఘనంగా ప్రపంచ రక్తదాతల దినోత్సవం
● దాతలను సన్మానించిన నిర్వాహకులు



శృంగవరపుకోట: రక్తదాతలను సన్మానిస్తున్న రెడ్‌క్రాస్ సొసైటీ సభ్యులు

శృంగవరపుకోట: ఆపదలో ఉన్నవారికి రక్తం అందించిన వారు ప్రాణదాతలని ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ సబ్ డిస్ట్రిక్ట్ బ్రాంచ్ ఎస్.కోట చైర్‌పర్సన్ డాక్టర్ పి.వరలక్ష్మి తెలిపారు. పట్టణంలోని కోలపర్తి ఆస్పత్రిలో ప్రపంచ రక్తదాతల దినోత్సవాన్ని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సొసైటీ జిల్లా ఎంసీ మెంబర్ డి.సూర్యారావు మాట్లాడుతూ, సొసైటీ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరాలు నిర్వహించడం అభినందనీయమన్నారు. అనంతరం రక్తదాతలు జీఎస్.నాయుడు, దొడ్డ నారాయణరావు, సిండికేట్ సుబ్బారావు, జి.సురేష్‌కుమార్‌లను సత్కరించారు. కార్యక్రమంలో రెడ్‌క్రాస్ వైస్‌చైర్మన్ ఎ.మల్లేశ్వరరావు, ఎంసీ మెంబర్లు డాక్టర్ ఎం.వేణు, జోగారావు, ఎల్.సాంబమూర్తి, లోకేష్ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో..



శృంగవరపుకోట: మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ కేశవరావు

శృంగవరపుకోట: పట్టణంలోని పుణ్యగిరిలో ఉన్న ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్రపంచ రక్తదాతల దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ డాక్టర్ సీహెచ్ కేశవరావు మాట్లాడుతూ.. రక్తాన్ని కృత్రిమంగా తయారు చేయడానికి వీలు కాదన్నారు. దాతలు రక్తం అందిస్తేనే ఎదుట వారి ప్రాణాలు కాపాడవచ్చని చెప్పారు. 18 నుంచి 55 ఏళ్ల మధ్య వయసున్న వారు రక్తదానం చేయడానికి అర్హులని తెలిపారు. ఎన్.ఎస్.ఎస్ పీఓ డాక్టర్ జి.ఈరన్న మాట్లాడుతూ.. 1901లో ఆస్ట్రేలియాకు చెందిన నోబెల్ విజేత కార్లే లాండ్‌స్టీనర్ మొదటిసారిగా రక్తాన్ని వర్గీకరించారని, ఆయన పుట్టినరోజును రక్తదాతల దినోత్సవంగా జరుపుకుంటున్నామని చెప్పారు.

రక్తదాతకు సత్కారం



చీపురుపల్లి: రక్తదాత వైకుంఠరావును సత్కరిస్తున్న ఆశయ సంస్థ అధ్యక్షుడు రమణ

చీపురుపల్లి: అత్యవసర పరిస్థితుల్లో 16 సార్లు రక్తదానం చేసిన వైకుంఠరావును ప్రతి ఒక్కరూ ఆదర్శంగా తీసుకోవాలని ఆశయ యూత్ అసోసియేషన్ అధ్యక్షుడు రెడ్డి రమణ పిలుపునిచ్చారు. ప్రపంచ రక్తదాతల దినోత్సవాన్ని పురస్కరించుకుని శుక్రవారం ఆయన్ను ఆశయ సంస్థ ఆధ్వర్యంలో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా రమణ మాట్లాడుతూ... ఎక్కడ రక్తదాన శిబిరం నిర్వహించినా, ఎలాంటి ఆహ్వానం లేకపోయినా అక్కడకు వెళ్లి స్వచ్ఛందంగా రక్తదానం చేయడం వైకుంఠరావుకు అలవాటన్నారు. ఇలాంటి వారిని యువత ఆదర్శంగా తీసుకుని ముందుకు సాగాలని సూచించారు.

మొక్కలు నాటడం అలవాటు కావాలి

● జియో రామకృష్ణ



మొక్కలు నాటుతున్న సర్పంచ్ సంతోషికుమారి, తదితరులు

శృంగవరపుకోట : పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ మొక్కలు నాటడం అలవాటు చేసుకోవాలని జియో సంస్థ వ్యవస్థాపకుడు బొబ్బిలి రామకృష్ణ అన్నారు. రామకృష్ణ, విజయలక్ష్మి పెళ్లిరోజు సందర్భంగా స్థానిక సిమ్ కార్యాలయం ఆవరణలోను, ఎస్సీ కాలనీలో సమీపంలో ఎస్.కోట సర్పంచ్ జి. సంతోషికుమారి ఆధ్వర్యంలో శుక్రవారం మొక్కలు నాటారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ, పచ్చదనాన్ని పెంపొందించుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. జియో రామకృష్ణ మాట్లాడుతూ... పర్యావరణం, పచ్చదనం పెంపు మన లక్ష్యం కావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సతీష్, ఎ.చెల్లయ్య, ఎన్.కృష్ణ, బి.హృషికేష్, లాస్యశ్రీ, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

హామీలు నెరవేర్చడం హర్షణీయం..



సమావేశంలో మాట్లాడుతున్న టీడీపీ నాయకులు

గజపతినగరం రూరల్: ముఖ్యమంత్రిగా బాధ్యతలు స్వీకరించిన వెంటనే డీఎస్సీ, పింఛన్ల పెంపు, తదితర ఐదు హామీలపై చంద్రబాబునాయుడు సంతకాలు చేయడం హర్షణీయమని టీడీపీ నాయకులు గంట్యాడ శ్రీదేవి, కొండపల్లి భాస్కరనాయుడు, మక్కువ శ్రీధర్, చంద్రినాయుడు అన్నారు. శుక్రవారం వారు విలేకరులతో మాట్లాడుతూ, ఎమ్మెల్యేగా గెలిచిన తొలిసారే కొండపల్లి శ్రీనివాస్‌కు మంత్రిగా అవకాశం దక్కడం ఆనందదాయకమన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పోలవరం పూర్తయితే ఉత్తరాంధ్రకు మేలు

● మాజీ ఎమ్మెల్యే గద్దే బాబూరావు



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే గద్దే బాబూరావు

చీపురుపల్లి: పోలవరం ప్రాజెక్ట్ నిర్ణీత ఎత్తులో పూర్తి చేస్తే ఉత్తరాంధ్రలోని విజయనగరం, శ్రీకాకుళం, విశాఖపట్టణం జిల్లాలకు ఎంతో మేలు జరుగుతుందని మాజీ ఎమ్మెల్యే గద్దే బాబూరావు అన్నారు. శుక్రవారం ఆయన నివాసం వద్ద ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ.. సీడబ్ల్యూసీ నిర్దేశించిన ప్రకారం 45.78 మీటర్ల ఎత్తులో ప్రాజెక్ట్ నిర్మాణం పూర్తయితే విజయనగరం, శ్రీకాకుళం జిల్లాల్లోని 8 లక్షల ఎకరాలకు సాగునీరు అందుతుందన్నారు. అలాగే విశాఖపట్టణం సిటీతో బాటు జిల్లా వ్యాప్తంగా తాగు, సాగునీటి సమస్య తీరుతుందని చెప్పారు. అదేవిధంగా పట్టాదారు పాస్‌పుస్తకాలపై ఎవరి ఫొటోలు లేకుండా సర్కారు లోగో మాత్రమే ఉండేవిధంగా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు. రాష్ట్రం అభివృద్ధి దిశగా అడుగులు వేయాలంటే శాసనమండలిని రద్దు చేయాలని అభిప్రాయపడ్డారు. టీడీపీలో సీనియర్లను పార్టీ అభివృద్ధి కోసం వినియోగిస్తూ.. కొత్త వారికి మంత్రివర్గంలో చోటు కల్పించడం ఆహ్వానించదగ్గ పరిణామమని చెప్పారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు కరణం మురళి ఉన్నారు.

నిధుల దుర్వినియోగంపై విచారణ



విచారణ చేపడుతున్న ఏపీడీ అరుణశ్రీ

దత్తిరాజేరు : మండలంలోని దత్తి గ్రామంలో నాలుగు చెరువులలో ఉపాధి హామీ పనులు చేయకుండా నిధులు దుర్వినియోగం చేశారని గ్రామానికి చెందిన ఎస్. ఆనంద్ ఫిర్యాదు మేరకు ఉపాధి ఏపీడీ అరుణశ్రీ శుక్రవారం విచారణ చేపట్టారు. ఎంపీడీఓ చంద్రకుమారి ఆధ్వర్యంలో గ్రామ సచివాలయంలో నిర్వహించిన విచారణలో కొండపచెరువు, గొల్లలచెరువు, కర్నపుచెరువు, కొత్త చెరువులలో పనులు చేసినదీ, లేనిదీ ఆరా తీశారు. గ్రామస్తులు, ఫిర్యాదుదారుడి సమక్షంలో విచారణ చేపట్టారు. అనంతరం ఏపీడీ మాట్లాడుతూ, నివేదికను ఉన్నతాధికారులకు పంపిస్తామని చెప్పారు. విచారణలో ఏపీడీఓ జనార్దన్, ఏపీఓ వెంకటప్పలనాయుడు, సర్పంచ్ తలారి వరహాలమ్మ, పలువురు గ్రామపెద్దలు పాల్గొన్నారు.

21న మండల పరిషత్ సమావేశం

కొత్తవలస: ఈ నెల 21న మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో ఎంపీపీ నీలంశెట్టి గోపమ్మ అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ రమణయ్య శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 11 గంటలకు ప్రారంభం కానున్న ఈ సమావేశానికి ఎంపీటీసీ సభ్యులు, సర్పంచ్‌లు, మండల అధికారులు తప్పకుండా హాజరుకావాలని కోరారు.

ఫీల్డ్ అసిస్టెంట్‌ను తొలగిస్తేనే పనులకు వెళ్తాం..

● స్పష్టం చేసిన పాలవలస వేతనదారులు



ఎంపీడీఓ వెంకటరమణకు ఫిర్యాదు చేస్తున్న పాలవలస వేతనదారులు

గుర్ల: మండలంలోని పాలవలస ఫీల్డ్ అసిస్టెంట్‌ను తొలగిస్తేనే ఉపాధి పనులకు వెళ్తామని వేతనదారులు స్పష్టం చేశారు. ఈ మేరకు శుక్రవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయానికి పెద్ద ఎత్తున వేతనదారులు చేరుకొని ఎంపీడీఓ బి. వెంకటరమణకు ఫీల్డ్ అసిస్టెంట్ సత్యనారాయణపై ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా వేతనదారులు మాట్లాడుతూ, ఫీల్డ్ అసిస్టెంట్‌కు నచ్చకపోతే జాబ్‌కార్డులు తొలగిస్తున్నాడని ఆరోపించారు. అలాగే ఒక్కో వేతనదారుడి నుంచి వారానికి రూ. 50 చొప్పున వసూలు చేస్తున్నాడన్నారు. వెంటనే ఆయన్ను తొలగించాలని కోరారు. దీనికి ఎంపీడీఓ స్పందిస్తూ ఫిర్యాదును జిల్లా ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి, సమస్య పరిష్కారానికి కృషి చేస్తానన్నారు.

ఆకట్టుకుంటున్న టైర్ కుర్చీలు



ఆకర్షణీయంగా కనిపిస్తున్న టైర్ కుర్చీలు

విజయనగరం: నిరుపయోగ వస్తువులతో వినూత్న పరికరాలను రూపొందిస్తూ ఆదర్శంగా నిలుస్తోంది విజయనగరం మున్సిపల్ కార్పొరేషన్ ప్రజారోగ్య విభాగం. చెత్త తరలించే ట్రాక్టర్ల టైర్లతో (పాడైనవి) ఆకర్షణీయమైన కుర్చీలను తయారు చేస్తూ అందరి అభినందనలు పొందుతున్నారు. ప్రజారోగ్య విభాగానికి చెందిన రమేష్‌రాజుకు వచ్చిన నూతన ఆలోచనకు ఆవిష్కృతమే ఈ విలాసవంతమైన టైర్ కుర్చీలు. వాస్తవానికి కుర్చీలు ఐరన్, చెక్కబల్లలు, ప్లాస్టిక్‌తో తయారు చేస్తుంటారు. వాటి స్థానంలో నిరుపయోగంగా పడి ఉన్న టైర్లతో కుర్చీలను తయారు చేస్తూ ఆకర్షణీయమైన రంగులతో అందంగా తీర్చిదిద్దుతున్నారు. కొన్ని టైర్లలో మొక్కలను పెంచే విధంగా కూడా రూపొందిస్తున్నారు. వీటిని నగరంలో అనేక ప్రాంతాలలో ఏర్పాటుచేసి ప్రజలను చైతన్యపరిచే ఏర్పాట్లు చేస్తున్నారు. ప్రజారోగ్య విభాగం రూపొందించిన కొత్త విధానం పలువురికి ఆదర్శం కావాలని కార్పొరేషన్ కమిషనర్ ఎంఎం నాయుడు ఆకాంక్షించారు.

వినియోగించుకుంటే ఉపయోగమే..

● నిరుపయోగంగా కార్పొరేషన్ భవనాలు
● గతంలో మీ సేవల నిర్వహణ కోసం రూ.30 లక్షలతో 3 భవనాల నిర్మాణం
● 2020 నుంచి సేవలు నిలిపివేయడంతో నిరుపయోగంగా మారిన వైనం
● సచివాలయ నిర్వహణకు భవనాలు కేటాయిస్తే ప్రయోజనం



ఆర్టీసీ కాంప్లెక్స్ జంక్షన్ వద్ద నిరుపయోగంగా ఉన్న కార్పొరేషన్ భవనం

విజయనగరం: విలువైన కార్పొరేషన్ ఆస్తులు నిరుపయోగంగా దర్శనమిస్తున్నాయి. కొన్నేళ్లుగా నగరంలోని ప్రధాన ప్రాంతాల్లో ఉన్న భవనాల్లో ఎటువంటి కార్యకలాపాలు నిర్వహించకపోవడంతో శిథిలావస్థకు చేరుకుంటున్నాయి. 2004 – 05 సంవత్సరంలో మీ సేవల నిర్వహణ కోసం విజయనగరం మున్సిపల్ కార్పొరేషన్ నగరంలోని వివిధ ప్రాంతాల్లో మూడు భవనాలు నిర్మించింది. కార్పొరేషన్‌కు చెందిన స్థలాల్లో ఒక్కో భవన నిర్మాణానికి రూ.10 లక్షల చొప్పున కేటాయించారు. ఈ భవనాలను జిల్లా యంత్రాంగం మీ సేవలకు కేటాయించారు. అయితే గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ప్రభుత్వ సేవలన్నీ క్షేత్ర స్థాయిలో ప్రజలకు అందుబాటులో ఉండాలనే ఉద్దేశంతో సచివాలయ వ్యవస్థ ఏర్పాటు చేసింది. దీంతో జిల్లా యంత్రాంగం ఆధ్వర్యంలో నడుస్తున్న మీ సేవా కేంద్రాలను నిలిపివేశారు. దీంతో ఆ భవనాలు నిరుపయోగంగా మారాయి. నగరంలోని ఆర్టీసీ కాంప్లెక్స్ జంక్షన్ వద్దగల మీసేవా కేంద్రం భవన ప్రాంగణం ప్రస్తుతం వాహనాల పార్కింగ్‌కు , అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మారింది. రింగ్‌రోడ్డులో ఏర్పాటు చేసిన మరో కేంద్రం ముందు భాగంలో చిన్న చిన్న దుకాణాలు వేసుకుని స్థానికులు వ్యాపారాలు సాగించుకుంటున్నారు. అదేవిధంగా పాత బస్టాండ్ ప్రాంతంలో మరో భవనం కూడా వినియోగానికి నోచుకోవడం లేదు.

ముఖ్య కూడళ్లలో భవనాలు..

నిరుపయోగంగా ఉన్న మూడు విలువైన భవనాలు నగరంలో నిర్వహిస్తున్న సచివాలయాలకు కేటాయిస్తే ప్రయోజనం ఉంటుందన్న అభిప్రాయం సర్వత్రా వ్యక్తమవుతోంది. విజయనగరం మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో 50 డివిజన్లు ఉండగా... 61 సచివాలయాలను ఏర్పాటు చేశారు. అధికారిక లెక్కల ప్రకారం 50 సచివాలయాలు అద్దె భవనాల్లో కొనసాగుతున్నాయి. ఒక్కో భవనానికి ప్రతి నెలా రూ.10,000 చొప్పున రూ.5.30 లక్షల మొత్తాన్ని అద్దె రూపంలో చెల్లిస్తున్నారు. ఈ నేపథ్యంలో ఖాళీగా ఉన్న ఒక్కో భవనంలో సమీప డివిజన్‌కు చెందిన రెండు సచివాలయాలు ఏర్పాటు చేసుకుంటే కార్పొరేషన్‌పై ఆర్థిక భారం తగ్గుతుంది. ఇదే విషయమై కార్పొరేషన్ కమిషనర్ ఎం.మల్లయ్యనాయుడు వద్ద సాక్షి ప్రస్తావించగా... కార్పొరేషన్‌కు చెందిన భవనాలు ఖాళీగా ఉండడంపై పరిశీలిస్తామన్నారు. ప్రస్తుతానికి ఆ భవనాలు జిల్లా యంత్రాంగం ఆధీనంలో ఉన్నాయని చెప్పారు. వారు అప్పగిస్తే తదుపరి నిర్ణయం తీసుకుంటామన్నారు.

నెల్లిమర్లలో వర్షం

నెల్లిమర్ల రూరల్: మండల కేంద్రంతో పాటు గ్రామాల్లో శుక్రవారం సాయంత్రం ఓ మోస్తారు వర్షం కురిసింది. ఉదయం 9 గంటల నుంచిబ అధిక ఉష్ణోగ్రతలు నమోదు కావడంతో ప్రజలు ఇబ్బందులు పడ్డారు. తీవ్ర ఉక్కబోతతో అవస్థలు పడిన ప్రజలకు సాయంత్రం పడిన వర్షం ఊరటనిచ్చింది. ఇదిలా ఉంటే వర్షానికి సతివాడ సబ్ స్టేషన్ పరిధిలో గంటల తరబడి విద్యుత్ నిలిపివేయడంతో ప్రజలు ఇబ్బంది పడ్డారు.

అప్రమత్తత తప్పనిసరి..

● వర్షాలు పడుతుండడంతో సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశం
● దోమల నివారణతో వ్యాధులకు చెక్
● వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రత ముఖ్యం



పూసపాటిరేగలో పారిశుధ్య పనులు చేస్తున్న పంచాయతీ కార్మికులు

పూసపాటిరేగ : తొలకరి వర్షాలు పడుతున్న నేపథ్యంలో వాతావరణంలో మార్పులు చోటు చేసుకుంటున్నాయి. అయితే ముందస్తు జాగ్రత్తలు తీసుకుంటే వ్యాధులకు దూరంగా ఉండవచ్చు. పరిసరాల పరిశుభ్రత లోపిస్తే దోమలు వృద్ధి చెందే అవకాశ ఉంది. ఆడ అనాఫిలెస్ దోమ వల్ల మలేరియా వ్యాప్తి చెందుతుంది. ఈ దోమ సాధారణంగా ఇంటి ముందు నిల్వ ఉన్న నీటిలో, మంచినీటి తొట్టెలపై పెరుగుతుంది. సాధారణంగా మలేరియా జ్వరం 10 నుంచి 14 రోజుల వరకు ఉంటుంది. వణుకుతో కూడిన జ్వరం వస్తుంది. జ్వరం వచ్చినప్పుడు చెమటలు పట్టి తలనొప్పి ఎక్కువగా ఉంటుంది. ఈ వ్యాధి భారిన పడకుండా ఉండాలంటే పరిసరాల్లో దోమలు పెరగకుండా చూసుకోవాలి.

డెంగీ :

ఈవ్యాధి టైగర్ దోమ వల్ల వ్యాప్తి చెందుతుంది. ఈ దోమ సాధారణంగా నిల్వ ఉన్న నీటిలో గుడ్లు పెడుతుంది. డెంగీ జ్వరం 10 నుంచి 15 రోజుల వరకు ఉంటుంది. ఒక్కసారిగా జ్వరం వచ్చి తీవ్రమైన తలనొప్పి, నొసటిపై నొప్పి ఉంటుంది. కంటి లోపల కూడా నొప్పి ఎక్కువగా ఉంటుంది.

చికెన్ గున్యా :

ఈ వ్యాధి ఈడిస్ దోమ వల్ల వస్తుంది. చిన్నగా, నల్లగా ఉండే ఈ దోమపై తెల్లని మచ్చలుంటాయి. ఈ వ్యాధి కూడా మామూలుగా 10 నుంచి 14 రోజుల వరకు ఉంటుంది. జ్వరం తగ్గిన తర్వాత 10 రోజుల పాటు ఒళ్లు నొప్పులు ఉంటాయి. ఈ వ్యాధి సోకిన వారికి ఒళ్లు నొప్పులతో పాటు అధిక జ్వరం వస్తుంది .

మెదడు వాపు :

ఈ వ్యాధి క్యూలెక్స్ దోమ వల్ల వ్యాప్తి చెందుతుంది. ఈ దోమ ఎక్కువగా మురుగు నీటిలో పెరుగుతుంది. క్యూలెక్స్ దోమ ద్వారా వ్యాపించే అర్బోవైరస్ వల్ల కొంగలు, బాతులు, పందుల ద్వారా ఈ వ్యాధి మనుషులకు వ్యాపిస్తుంది. ఈ వ్యాధి 10 నుంచి 14 రోజుల పాటు ఉంటుంది. ఈ వ్యాధి సోకిన వ్యక్తికి జ్వరం రావడంతో పాటు మత్తుగా ఉన్నట్లు ఉంటుంది. వ్యాధిగ్రస్తులు ఒక్కోసారి అపస్మారర స్థితిలోకి వెళ్తారు. వ్యాధి తీవ్రంగా ఉన్నప్పుడు బ్రెయిన్ డెడ్ అయ్యే అవకాశాలు అధికంగా ఉంటాయి. ఈ వ్యాధి 2 నుంచి 14 ఏళ్ల లోపు చిన్నారులకు అధికంగా వ్యాపిస్తుంది.

దోమల నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలు

దోమల నివారణకు గుంతలు, లోతట్టు ప్రదేశాలు, వాడని బావులను పూడ్చివేయాలి. నీరు నిల్వ లేకుండా చూడాలి. చెత్తా, చెదారం మురుగు కాలువల్లో చేరకుండా చూడాలి. అన్ని రకాల నీటి నిల్వల్లో వారానికోసారి దోమ పిల్లల నియంత్రణ మందులు చల్లాలి. ఇళ్ల పరిసరాలలో ఉండే గుంతల్లో మురుగునీరు అధిక కాలం నిల్వ ఉండకుండా చూసుకోవాలి.

జ్వరం వస్తే వైద్యుడ్ని సంప్రదించాలి..



వర్షాకాలంలో జ్వరం రాగానే వెంటనే దగ్గరలో ఉన్న ప్రభుత్వాస్పత్రిలో చికిత్స పొందాలి. వైద్యుల సిఫార్సుల మేరకు మందులు వాడాలి. అయినా జ్వరం తగ్గకపోతే రక్త పరీక్షలు చేయించుకుని వ్యాధి నిర్ధారణకు అవసరమైన మందులు వాడి, జాగ్రత్తలు తీసుకోవాలి. వర్షాకాలంలో కాచి చల్లార్చిన నీటిని తాగాలి. వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రత పాటించాలి.

రాజేష్‌వర్మ, వైద్యాధికారి పూసపాటిరేగ పీహెచ్‌సీ

భాగీరథి జయంతికి సర్వం సిద్ధం



కరపత్రాలను ఆవిష్కరిస్తున్న మఠం ప్రతినిధులు రఘోత్తమ ఆచార్యులు, తదితరులు

విజయనగరం టౌన్: ఉత్తరాది మఠం పీఠాధిపతులు సత్యాత్మతీర్థ స్వామి ఆదేశంతో ఈ నెల 16న దశ హర దశమి భాగీరథి జయంతికి సర్వం సిద్ధం చేసినట్లు ఉత్తరాది మఠం ప్రతినిధి జి.రఘోత్తమ ఆచార్యులు తెలిపారు. ఈ మేరకు జయంతికి సంబంధించిన కరపత్రాలను శుక్రవారం మఠం ఆవరణలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఈ నెల 16న సాయంత్రం 6 గంటల నుంచి మఠంలో విష్ణు సహస్రనామ పారాయణం, దుర్గా స్తోత్రం, జయతీర్థ స్తుతి, రాఘవేంద్ర స్తోత్రం, తదితర కార్యక్రమాలు నిర్వహిస్తామని చెప్పారు. భక్తులందరూ కార్యక్రమంలో పాల్గొనిత రించాలని కోరారు. కార్యక్రమంలో మఠం ప్రతినిధులు మండపాక రవి, తదితరులు పాల్గొన్నారు.